MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 271 | సోమవారం 21 జూలై 2025 | పేజీలు : 4 | వెల : 3/-

## ఉచిత బస్సు పథకంలో

# 'జీరో ఫేర్ టిక్కెట్'

### ఆగస్ట్ 15 నుంచి పథకం అమలుకు సీఎం చంద్రబాబు ఆదేశం

### ఇకపై ఏసీ ఎలక్ట్రానిక్ బస్సులు మాత్రమే కొనుగోలు




**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకంలో మహిళలకు 'జీరో ఫేరో టిక్కెట్' ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఎక్కడ నుంచి ఎక్కడకు ప్రయాణం చేస్తున్నారు... ఉచిత ప్రయాణంతో ఎంతమేర వారికి డబ్బులు ఆదా అయ్యాయి... 100 శాతం ప్రభుత్వం ఇస్తున్న రాయితీ... వంటి వివరాలు ఆ టిక్కెట్‌లో పొందుపరచాలని చెప్పారు. జీరో ఫేర్ టిక్కెట్ ఇవ్వడం ద్వారా ఎంత లబ్దిపొందారనే విషయం రాష్ట్రంలోని మహిళా ప్రయాణికులు అందరికీ సులభంగా తెలుస్తుందని ముఖ్యమత్రి అన్నారు. ఇందుకు సంబంధించి సాఫ్ట్‌వేర్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సోమవారం సచివాలయంలో మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకంపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఏ ఏ రాష్ట్రాలకు ఆర్థికంగా ఎంత భారం పడింది... మన రాష్ట్రంలో ఎంత వ్యయం కానుందనే అంశాలపై అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. ఎట్టిపరిస్థితుల్లో పథకాన్ని ఆగస్ట్ 15 నుంచి సమర్ధవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం త్వరలో అమలు చేస్తున్నందున - మిగతా3లో

# జగన్ నీ పద్ధతి మార్చుకో..

- మంత్రి అచ్చెన్నాయుడు స్ట్రాంగ్ వార్నింగ్
- ఒక దుర్మార్గుడైన జగన్మోహన్ రెడ్డి పాలనను ప్రజలు తిరస్కరించి కూటమి ప్రభుత్వానికి ప్రజలు విజయం అందించారు
- 2019లో 151 సీట్లు గెలవడంతో జగన్ ప్రభుత్వానికి అడ్డూ అదుపు లేకుండా పోయింది
- టీడీపీ అధికారంలో ఉంటే ప్రజల కోసం పని చేస్తాం
- ప్రతిపక్షంలో ఉంటే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి పోరాడుతాం



**విశాఖపట్నం**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దుర్మార్గుడైన జగన్మోహన్ రెడ్డి పాలనను ప్రజలు తిరస్కరించి కూటమి ప్రభుత్వానికి ప్రజలు విజయం అందించారని తెలిపారు. 2019లో 151 సీట్లు గెలవడంతో జగన్ ప్రభుత్వానికి అడ్డూ అదుపు లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. జగన్ రెడ్డి ఇప్పటికైనా నీ పద్ధతి మార్చుకో అని స్టాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఇవాళ(సోమవారం) పెందుర్తి మండలం గుర్రంపాలెం గ్రామంలో పెందుర్తి ఇన్‌చార్జ్ గండి బాబ్జి - మిగతా3లో

## 4 వేల మందితో కదం తొక్కిన విద్యుత్ ఉద్యోగులు

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పగలగొట్టమన్న ఇప్పుడెందుకు బిగిస్తున్నారు

విద్యుత్ కార్మికుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలి: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్

# దేనికైనా రెడీ.. ఎన్ని కేసులైనా పెట్టుకోండి



- చంద్రబాబు దుష్టపాలన అంతానికి అంతా కలిసి కట్టుగా పని చేస్తామని
- ఎన్ని కష్టాలు ఎదురైనా జగన్ వెంటే నడుస్తామని, చంద్రబాబు ప్రభుత్వంపై పోరాటం కొనసాగుతుంది
- జగన్ పార్టీ పెట్టిన దగ్గర నుండి అయన వెంటే నడుస్తున్నాం
- గతంలో చంద్రబాబు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో ఎన్నో మీటింగ్‌లు పెట్టారు.. ర్యాలీలు నిర్వహించారు.
- వైఎస్సార్‌సీపీ నేతలు, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని

# ప్రజాశ్రేయస్సే ప్రధాన లక్ష్యం

### రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



**అంకుశం ప్రతినిధితిరుపతి, జూలై 21:**

ప్రజా శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సోమవారం తిరుపతి, చిత్తూరు జిల్లాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తిరుపతి జిల్లాలో గిరిజన విద్యాసంస్థలు, వసతిగృహాలు, శిశు సంక్షేమ కేంద్రాల అభివృద్ధికి అనేక నిధులు మంజూరయ్యాయని వివరించారు. ఏపీ టివోఆర్‌ఎస్ బాలికల హాస్టల్, తిరుపతికి రూ. 352.00 లక్షలు కొత్త భవనాలు %ం% స్టాఫ్ క్వార్టర్స్ నిర్మాణం కోసం మంజూరయ్యాయన్నారు. ఈఎంఆర్ఎస్ -021, ఆర్టికల్ 275(1)కు రూ. 180.00 లక్షలు అదనపు సిబ్బంది నివాసాల నిర్మాణానికి కేటాయించి నట్లు చెప్పారు. బిఎన్ కండ్రిగ (275(1)) కు ?180.00 లక్షలు, శ్రీకాళహస్తి అప్టర్స్ బాలుర వసతి గృహానికి రూ. 240.00 లక్షలు ఇచ్చామన్నారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా 23 సంస్థలకు కలిపి రూ. 176.55 లక్షలు మరమ్మత్తులు, ఆధునీకరణకు విడుదల చేశామన్నారు. ఈ అభివృద్ధి పనులు - మిగతా2లో



# విజయనగరంలో 23 నుంచి ఆంధ్ర సీనియర్స్ ప్రాబబుల్స్ క్రికెట్ మ్యాచ్‌లు

### అనంత నుంచి గిరి నాథ్ రెడ్డి మచ్చా దత్త రెడ్డి వినయ్ రాజకుల్లయప్ప అర్జున్ ఐదు మంది క్రికెటర్లు ఎంపిక









**అంకుశం స్పోర్ట్స్ ప్రతినిధి అనంతపురం జూలై 21**

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం పట్టణంలోని జీవీ రాజు క్రికెట్ మైదానం నందు ఈనెల 23 నుంచి 26వ తారీకు వరకు సీనియర్స్ ప్రాబబుల్స్ క్రికెట్ మ్యాచ్లు నిర్వహించడం జరుగుతుందని సీనియర్స్ ప్రాబ్లమ్స్ కు అనంతపురం జిల్లా నుంచి 5 మంది క్రికెటర్లు ఎంపికయ్యారని ఎంపికకు సంబంధించి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు నుంచి జిల్లాకు సమాచారం అందిందని అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు ఇటీవల అనంతపురంలో - మిగతా2లో

THE ANDHRA CRICKET ASSOCIATION ESTD : 1953

# జగన్ నీ పద్ధతి మార్చుకో..

-మొదటిపేజీ తరువాయి

ఆధ్వర్యంలో 'ఇంటింటికీ తెలుగుదేశం, సుపరిపాలనలో ముందడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి అచ్చెన్నాయుడు హాజరయ్యారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలన ఎలా ఉంది..?, సంక్షేమ పథకాలు సరిగ్గా అందుతున్నాయా లేదా..? అని మంత్రి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు.
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమం 'సుపరిపాలనలో ముందడుగు' అని ఉద్ఘాటించారు. తెలుగుదేశం అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నిరంతరం ప్రజల పక్షాన పనిచేస్తోందని చెప్పుకొచ్చారు. టీడీపీ అధికారంలో ఉంటే ప్రజల కోసం పని చేస్తామని.. ప్రతిపక్షంలో ఉంటే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి పోరాడుతామని పేర్కొన్నారు. 2019 తర్వాత తెలుగుదేశం చాలా ఇబ్బందులకు గురైందని చెప్పుకొచ్చారు. ఒక సమయంలో టీడీపీ ఏమవుతుందోనని ఆవేదన చెందానని తెలిపారు. తెలుగుదేశం పార్టీ వైసీపీ పార్టీ



లాగా గాలికి పుట్టలేదని.. ఎన్టీ రామారావు స్థాపించిన పార్టీ ఇదని ఉద్ఘాటించారు. 2019 తర్వాత ఏపీ పేరు చెబితే.. ఇతర రాష్ట్రాల వారు భయపడే పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు మంత్రి అచ్చెన్నాయుడు.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు లాంటి ఒక అనుభవం ఉన్న ముఖ్యమంత్రి ఉండటం ఏపీ ప్రజలు చేసుకున్న అదృష్టమని అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ వెంటిలేటర్‌పై ఉన్న సమయంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 200 అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించామని నొక్కిచెప్పారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఇచ్చి మాట నిలబెట్టుకున్నారని ఉద్ఘాటించారు. ఏపీలో 67 లక్షల మంది పిల్లలకు తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు మూడు వాయిదాల్లో రూ. 20000లు ఇస్తున్నామని చెప్పారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.

## ఉచిత బస్సు పథకంలో 'జీరో ఫేర్ టిక్కెట్'

-మొదటిపేజీ తరువాయి

ఆర్టీసీకి భారం కాకుండా... ఇతర ఆదాయ మార్గాలు పెంపొందించుకోవడం, నిర్వహణా వ్యయం తగ్గించుకోవడం ద్వారా సంస్థను లాభాల బాట పట్టించాలని ముఖ్యమంత్రి సూచించారు. లాభాల ఆర్జనకు ఎలాంటి మార్గాలున్నాయి.. ఎటువంటి విధానాలు తీసుకురావాలి... అనే దానిపై ఒక కార్యాచరణ రూపొందించాలన్నారు. మరోవైపు రాష్ట్రంలో ఇకపై ఏసీ ఎలక్ట్రానిక్ బస్సులు మాత్రమే కొనుగోలు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు. ప్రస్తుతం ఉన్నవాటిని ఎలక్ట్రికల్ బస్సులుగా మారిస్తే నిర్వహణా వ్యయం తగ్గుతుందని... అలాగే ఇందుకు అవసరమయ్యే విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోల్లోనూ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసే అంశంపైనా అధ్యయనం చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, రవాణశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్‌దండే తదితరులు పాల్గొన్నారు.

## జైలులో జగన్ కోటరీ

**రాజమండ్రి :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు అంత్యంత సన్నిహితులుగా ఉన్నవారంతా జైలు ఊచలు లెక్కపెట్టేందుకు సిద్ధంగా ఉండాల్సిందే. గత ఐదేళ్లలో జగన్ కు అనుకూలంగా ఉన్న అనేక మందిని ఇప్పటికే జైలుకు పంపారు. మద్యం స్కామ్ కేసులో ముఖ్యమంత్రి కార్యాలయంలో పనిచేసిన మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి తో పాటు ఓఎస్డీగా వ్యవహరించిన కృష్ణమోహన్ రెడ్డి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు తాజాగా మిథున్ రెడ్డి కూడా అరెస్ట్ అయ్యారు. అంటే జగన్ కు అత్యంత సన్నిహితంగా వ్యవహరించిన వారు ఇదే కేసులో జైలులో ఉన్నట్లయింది. జగన్ కు అత్యంత ఆప్తులుగా గత ఐదేళ్లలో వ్యవహరించిన వారందరూ వరసగా జైలుకు వెళుతున్నారు.కేవలం మద్యం కేసు మాత్రమే కాదు.. అనేక కేసులు వరసగా వైసీపీ నేతలను చుట్టుముట్టేటట్లు కనిపిస్తున్నాయి. తర్వాత మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ శాఖ భూములను కబ్జా చేశారన్న ఆరోపణలపై అరెస్ట్ చేసే అవకాశాలను కొట్టిపారేయలేం. ఎందుకంటే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇద్దరూ తొలి నుంచి వైరంతో ఉన్నవాళ్లే. కళాశాలలో చదివే నాటి నుంచి వీరి మధ్య వైరం ఉందంటారు. అదే వైరం రాజకీయాల్లోనూ కొనసాగుతూ వచ్చింది. ఇక మద్యం స్కామ్ కేసులో కాకుంటే మరొక కేసులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా అరెస్ట్ అయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఇప్పటికే పలు కేసులు ఆయనపై నమోదయ్యాయి.

# ఏపీకి పోర్టబుల్ ఆస్పత్రి...

**విజయవాడ :** మన దేశంలో రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తక్షణ వైద్యం అందక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా కేంద్ర ప్రభుత్వం 'భీష్మ' పేరుతో పోర్టబుల్ ఆసుపత్రిని అందుబాటులోకి తెచ్చింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మూడు భీష్మ యూనిట్లను కేటాయించింది. ఇది ఒక చిన్న ఆసుపత్రిలా పనిచేస్తుంది. దీని ద్వారా క్షతగాత్రులకు వెంటనే వైద్యం అందించవచ్చు. మన దేశలో రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు నిత్య కృత్యాలు. ప్రతి రోజు ఏదో ఒక చోట ప్రమాదాలు సంభవిస్తూనే ఉంటాయి. అయితే వెంటనే స్పందించి గాయపడిన వారికి చికిత్స అందిస్తే చాలా వరకు ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని నిపుణులు చెబుతుంటారు. కానీ మన దగ్గర అందుకు అవసరమైన సదుపాయాలు లేవు. దీంతో ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు వేళ తక్షణ సాయం అందక ప్రాణ నష్టం అధికంగా సంభవిస్తుంది. అయితే ఈ సమస్య పరిష్కారినికి కేంద్రం అద్భుతమైన ఆవిష్కరణ చేసింది. అదే భీష్మ .. పోర్టబుల్ ఆస్పత్రి. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఏపీకి మూడు భీష్మ యూనిట్లు కేటాయించింది. ఆ వివరాలు..విపత్తులు, ప్రమాదాల్లో గాయపడిన వారికి వెంటనే చికిత్స అందించే సమస్యను పరిష్కరించడానికి 'భీష్మ' అందుబాటులోకి వచ్చేసింది. ఇది ఒక పోర్టబుల్ ఆసుపత్రి. దీనిని ఆరోగ్య మైత్రి క్యూబ్ పేరుతో రక్షణ, ఆరోగ్య మంత్రిత్వ శాఖలు తయారు చేశాయి. దీని అసలు పేరు భారత్ హెల్త్ ఇనీషియేటివ్ ఫర్ సహయోగ్ హితా అండ్ మైత్రి (భీష్మ). విపత్తులు, ప్రమాదాల్లో గాయపడ్డ వారికి వెంటనే వైద్యం అందించేందుకు తయారు చేసిన భీష్మ యూనిట్లను ఏపీకి కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం గుంటూరు జిల్లాలోని మంగళగిరి ఎయిమ్స్‌కు మూడు భీష్మ యూనిట్లను కేటాయించింది.భీష్మ యూనిట్ అంటే 72 చిన్న క్యూబ్‌లతో



కూడిన ఒక చిన్న ఆసుపత్రి. దీని బరువు ఒక టన్ను ఉంటుంది. దీనిని రోడ్డు మార్గంలో ఎక్కడికైనా సులువుగా తీసుకెళ్లవచ్చు. డ్రోన్లు, పారాచూట్‌లతో పాటు హెలికాప్టర్‌లో కూడా తరలించవచ్చు. 10 నిమిషాల్లోనే దీన్ని ఆసుపత్రిగా మార్చవచ్చు. భీష్మ లెవెల్-3 ట్రామా సెంటర్‌గా కూడా పనిచేస్తుంది. ఇది గోల్డెన్ అవర్‌లో ప్రాణాలను కాపాడుతుంది. అడ్వాన్స్‌డ్ ట్రామా లైఫ్ సపోర్ట్, విపత్తుల్లో గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందిస్తుంది. దీనిలో టాక్టికల్ కాంబాట్ క్యాజువాల్టీ కేర్ కూడా ఉంది.ఇక ఈ భీష్మ యూనిట్ సౌర విద్యుత్తుతో నడుస్తుంది. దీనిలో వెంటిలేటర్లు, జనరేటర్లు, పరీక్షల కిట్లు, డాక్యుమెంటేషన్ టూల్స్‌తో పాటు పోర్టబుల్ ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్, ఏఈడీ, యాంటీబయాటిక్స్, ఐవీ ఫ్లూయిడ్లు, మినీ ల్యాబ్, సర్జికల్ కిట్లు, ఈసీజీ/బీపీ/ఎస్‌పీవో2 సిస్టం ఇలా చికిత్సకు అవసరమైన అన్ని యూనిట్లు ఉన్నాయి. ఇది పది నిమిషాల్లో 30కి పైగా పరీక్షల ఫలితాలను అందిస్తుంది. ఒక్కో యూనిట్‌లో 200 మందికి చికిత్స చేయవచ్చు. 20 అత్యవసర సర్జరీలు కూడా చేయవచ్చు.గుంటూరులోని ఎయిమ్స్‌కి కేంద్రం మూడు భీష్మ యూనిట్లను అందించింది. దీంతో ఎయిమ్స్‌లో వీటిని ప్రదర్శించారు. విశ్రాంత ఎయిర్ మార్షల్ డాక్టర్ తన్మయ్ రాయ్, యూనిట్‌ను ఆసుపత్రిగా ఎలా మార్చవచ్చో వివరించారు. ఈ భీష్మ యూనిట్‌ను క్షతగాత్రుల పాలిట సంజీవనిగా చెబుతున్నారు.

# 24 ఏళ్ల తర్వాత తీరనున్న కల

**ఏలూరు :** కోనసీమ వాసుల చిరకాల స్వప్నం నిజమయ్యే దిశగా అడుగులు పడుతున్నాయి! కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ కోసం 24 ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజల నిరీక్షణ ఫలించనుంది. ఇక కాకినాడ, రాజమండ్రి వెళ్లాల్సిన అవసరం లేదు. మూడేళ్లలో కోనసీమలో రైలు కూత వినపడుతుంది! భూసేకరణ పూర్తి చేసి, రైల్వే లైన్ నిర్మాణ పనులు వేగవంతం చేయనున్నారు. ఈ రైలు మార్గం 8 మండలాలు, 25 గ్రామాల మీదుగా వెళుతుంది. ఆంధ్రప్రదేశ్ కోనసీమ వాసుల దశాబ్దాల కల సాకారానికి అడుగులు పడుతున్నాయి. కోటిపల్లి, నర్సాపురం మధ్య కొత్త రైల్వే లైన్ నిర్మాణం కోసం ఈ ప్రాంత వాసులు సుమారు 24 ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. వారి ఎదురు చూపులకు తెర పడనుంది. ఇక వారు రైలు ఎక్కాలంటే కాకినాడో, రాజమహేంద్రవరమో వెళ్లాల్సిన పని లేదు. వారి ప్రాంతంలోనే రైలు పరుగులు పెట్టనుంది. అన్నీ అనుకున్నట్లే జరిగితే కేవలం మూడేళ్లలోనే కోనసీమలో రైలు కూత వినిపించనుంది. కోటిపల్లి-నరసాపురం రైల్వేలైను నిర్మాణ పనులకు అడ్డంకిగా మారిన ఎలైన్‌మెంట్లపై కోర్టు స్టేలు ఎత్తేసిన సంగతి తెలిసిందే. దీంతో రెండో విడత భూసేకరణకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. రానున్న ఐదు నెలల్లోనే భూసేకరణ పూర్తిచేసి ఆ స్థలాన్ని రైల్వేకు అప్పగించాలనే లక్ష్యంతో అధికారులు ముందుకు వెళ్తున్నారు. దీంతో రైల్వె లైన్ నిర్మాణ పనుల్లో వేగం పెరిగింది.ఈ రైల్వే లైను మొత్తం పొడవు 57.81 కిమీలు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కోటిపల్లి నుంచి పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వరకు దీన్ని నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ రైల్వే ప్రాజెక్టు మొత్తం 8 మండలాలు, 25 గ్రామాల పరిధిలో ఏర్పాటు కానుంది. దీనికి 846 ఎకరాల భూమి అవసరం. మొదటి విడత భూ సేకరణలో భాగంగా అధికారులు రామచంద్రపురం, అమలాపురం, కొత్తపేట మండలాల్లోని 8 గ్రామాల గుండా సుమారు 13.45 కి.మీ. పొడవున రైల్వే లైను ఏర్పాటుకు 255.835 ఎకరాలు గుర్తించారు.22 ఏళ్ల క్రితమే అనగా 2003 సంవత్సరంలోనే అధికారులు భూమిని సేకరించగా.. రైల్వే శాఖ ఇంకా దీన్ని స్వాధీనం చేసుకోలేదు. పైగా రైతులు కూడా తమకు అదనపు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఇప్పటివరకు ఈ ప్రాజెక్టు కోసం 279 ఎకరాల భూమిని రైల్వేకు అప్పగించినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.రెండో విడత భూసేకరణ పనుల్లో భాగంగా 34.90 కిమీల రైల్వే లైన్ నిర్మాణం కోసం అమలాపురం మండలం భట్నవిల్లి గ్రామం నుంచి మలికిపురం మండలం గుడిమెల్లంక వరకు 18 గ్రామాల పరిధిలో 590.348 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఇప్పటికే అధికారులు రాజోలు, మామిడికుదురు, మలికిపురం మండలాల్లోని 13 గ్రామాల్లో సర్వే చేసి 402.637 ఎకరాలు గుర్తించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూమి సేకరణ కోసం తొలుత ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేసి, ఐదు నెలల్లో భూసేకరణ పూర్తిచేస్తామని తెలిపారు.ఆ తర్వాత మిగిలిన 188 ఎకరాల భూసేకరణపై దృష్టి సారిస్తామని తెలిపారు. ఇందు కోసం 5 గ్రామాల్లో సంయుక్త సర్వే చేసేందుకు రెవెన్యూ అధికారులకు లేఖ రాసినట్లు రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ తెలిపారు. మూడు వంతెనల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా మూడు బ్రిడ్జీల నిర్మాణం కోసం ఇప్పటికే అమలాపురం మండలం పేరూరు, మామిడికుదురులోని పాశర్లపూడి, మలికిపురంలోని

## విజయనగరంలో 23 నుంచి ఆంధ్ర సీనియర్స్ ప్రాబబుల్స్ క్రికెట్ మ్యాచ్ లు

-మొదటిపేజీ తరువాయి

జరిగిన సీనియర్ సౌత్ జోన్ అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో అద్భుత ప్రదర్శన కనబరిచిన అనంతపురం జిల్లాకు చెందిన సీనియర్ క్రికెటర్లను ఐదు మందిని ఎంపిక చేశారని భీమ లింగారెడ్డి తెలిపారు ఎంపికైన క్రికెటర్లు 22వ తారీఖున విజయనగరంలో రిపోర్ట్ చేయవలసి ఉంటుందని ఆంధ్ర పరిధిలో ప్రతిభ చూపిన క్రికెటర్లను నాలుగు జట్లుగా ఎంపిక చేశారని అందులో అనంతపురం జిల్లా నుంచి ఐదు మంది క్రికెటర్లు ఎంపిక కావడం అభినందనీయమని జిల్లా కార్యదర్శి భీమ లింగారెడ్డి తెలిపారు అనంతపురం జిల్లా నుంచి ఎంపికైన క్రికెటర్ లో గిరినాథ్ రెడ్డి రంజీ క్రికెటర్ విజయ హజారే సయ్యద్ టోర్నమెంట్లో లో పాల్గొన్నారు వినయ్ కుమార్ గత ఏడాది రంజీ జట్టుకి ఎంపికయ్యారని అండర్ 23 ఇతర టోర్నమెంట్ లో కూడా ఆడారని అంతర్ జిల్లాల పోటీలలో 89 రన్లు సాధించి ఆరు వికెట్లు తీశారని అన్నారు మచ్చ దత్త రెడ్డి రంజీ క్రీడాకారుడు అండర్ 23 అండర్ 19 రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించారు అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో 146 పరుగులు రెండు అర్థ సెంచరీలతో సాధించారు అర్జున్ టెండూల్కర్ అండర్ 23 అండర్ 19 రాష్ట్ర జట్టుకి గతంలో ఆడారు అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో 127 పరుగులు ఒక అర్థ సెంచరీ తో సాధించారు అండర్ 23 అండర్ 19 స్టేట్ ప్రాబ్లమ్స్ కి ఆడారని ఇటీవల జరిగిన సీనియర్స్ అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో 142 పరుగులు రెండు అర్థ సెంచరీలు సాధించారని తెలిపారు గిరినాథ్ రెడ్డి వినయ్ కుమార్ మచ్చ దత్తారెడ్డి రాజకుల్లాయప్ప అర్జున్ టెండూల్కర్ అనంతపురం జిల్లా నుంచి ఎంపీ కావడం పట్ల జిల్లా క్రికెటర్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రకాష్ రెడ్డి భీమలింగారెడ్డి ఇతర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్ క్రికెట్ పోటీలలో రాణించి రాష్ట్ర జట్టుకి ఎక్కువ మంది అనంతపురం జిల్లా నుంచి ఎంపిక కావాలని ఆకాంక్షించారు

## ప్రజాశ్రేయస్సే ప్రధాన లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

పూర్తయ్యే ద్వారా తిరుపతి జిల్లాలోని గిరిజన విద్యాసంస్థలు, హాస్టల్స్, శిశు సంక్షేమ కేంద్రాలకు మౌలిక సదుపాయాలు మెరుగవుతాయని మంత్రి సంధ్యారాణి ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాలను, ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరు, తక్షణం ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో మంత్రి అధికారులతో విస్తృతంగా చర్చించారు. జిల్లాల్లో జరుగుతున్న మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమం కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష చేశారు. "ప్రతి చిన్నారికి పోషకాహారం, విద్య, ఆరోగ్యం చేరాలని, ప్రతి గిరిజన కుటుంబం అభివృద్ధి పథంలో నడవాలని సూచించారు. పథకాల్లో పారదర్శకత ఉండాలని, క్షేత్రస్థాయిలో సమస్యలపై అధికారుల స్పందన వేగంగా ఉండాలని పేర్కొన్నారు. పోషణ అభియాన్ అమలు స్థితి, ఐసిడిఎస్ ప్రాజెక్టుల పురోగతి, గిరిజన వసతిగృహాల పరిస్థితి, గిరిజన విద్యార్థులకు అవసరమైన విద్యా పరికరాల సరఫరా, అంగన్వాడీ కేంద్రాల కార్యకలాపాల సమీక్ష, గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలపై మంత్రి సంధ్యారాణి సమీక్షించారు. అధికారుల నుంచి ప్రగతిని సమీక్షించిన అనంతరం, మంత్రి పలు అంశాల్లో తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరే విధంగా డేటా ఆధారిత పాలన, ప్రజా అభిప్రాయాల సేకరణపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సమావేశంలో రెండు జిల్లాల మహిళా, శిశు సంక్షేమ శాఖాధికారులు, గిరిజన సంక్షేమ శాఖాధికారులు, ఐటిడిఎ అధికారులు, సీడీపీఓలు, ఇతర సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు. "ప్రభుత్వ పథకాలు లక్ష్య సమూహాలకు పూర్తి స్థాయిలో అందాలని మంత్రి అన్నారు.

## 4 వేల మందితో కదం తొక్కిన విద్యుత్ ఉద్యోగులు







**(అంకుశం, అమరావతి, జూలై 21):** విద్యుత్ కార్మికులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హెచ్చరించారు. ఏఐటీయూసీ అనుబంధ సంస్థలు ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్, వర్కర్స్ యూనియన్, గ్రామ, వార్డు సచివాలయం ఎంప్లాయిస్ యూనియన్, ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అండ్ మీటర్ రీడర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం చలో విజయవాడ కార్యక్రమం చేపట్టారు. అపరిష్కతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగరంలోని రైల్వే స్టేషన్ నుండి ధర్నా చౌక్ వరకు వేలాదిమంది కార్మికులు భారీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై విద్యుత్ కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను ఈ రోజు సాయంత్రం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి వివరిస్తానని ప్రకటించారు. అపరిమితమైన ఆరోగ్య పాలసీ, జీతాలు పెంపుదల, పదోన్నతి తదితర సమస్యలను పరిష్కరించాలని కోరతామని తెలిపారు. నేరుగా జీతాలు అందజేసే విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తుందని , ఏపీ ప్రభుత్వం కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు . కార్మికులు గొంతెమ్మ కోరికలు కోరడం లేదని న్యాయపరమైనవి మాత్రమే కోరుకుంటున్నారని చెప్పారు. దేశంలోనే అగ్రభాగన మన రాష్ట్ర విద్యుత్ సంస్థలు ఉన్నాయని. ఈ స్థాయిలో ఉండటానికి పై స్థాయి అధికారులు కషి ఏమాత్రం కాదని. క్రింద స్థాయి కార్మికులు చేస్తున్న కషి ఫలితమేనని ప్రభుత్వం గుర్తించాలని సూచించారు.అతి తక్కువ వేతనాలు తీసుకుని ప్రాణాలు సహితం లెక్కచేయకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నారని అన్నారు. ఈ క్రమంలో మన సంస్థలో పనిచేస్తున్న ఎందరో కార్మికులు తమ ప్రాణాలను అర్పించిన పరిస్థితి ఉందన్నారు. విద్యుత్ సరఫరా మొత్తం కార్మికుల చేతుల్లోనే ఉందని, ఒక్కసారి షడ్ డౌన్ చేస్తే ఉన్నతాధికారుల ఏసీ లు పని చేయవని, మీ కష్టానికి గుర్తింపు వస్తోందన్నారు. రాష్ట్రమే అంధకారంలో ఉంటుందన్నారు.ఎనర్జీ అసిస్టెంట్స్, లైన్ మాన్ లకు, ఇతర కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.యూనియన్ గుర్తింపు ఇచ్చి ఎన్నికల జరపాలని కోరారు.

## దేనికైనా రెడీ.. ఎన్ని కేసులైనా పెట్టుకోండి

**పల్నాడు:** ఏపీలో చంద్రబాబు దుష్టపాలన అంతానికి అంతా కలిసి కట్టుగా పని చేస్తామని, ఈ క్రమంలో ఎన్ని కేసులు పెట్టిన భయపడబోమని వైఎస్సార్‌సీపీ నేతలు, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని అన్నారు. సోమవారం సత్తెనపల్లి గ్రామీణ పీఎస్‌లో విచారణకు హాజరైన అనంతరం వాళ్లు మీడియాతో మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్ గత నెల 18న రెంటపాళ్లలో పర్యటించారు. ఆ టైంలో జనసమీకరణ చేపట్టారంటూ పోలీసులు కేసు నమోదు చేసి నోటీసులిచ్చారు. ఈ కేసులో విచారణ నిమిత్తం అంబటి, రజిని ఇవాళ పీఎస్‌కు వచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్ని కష్టాలు ఎదురైనా జగన్ వెంటే నడుస్తామని, చంద్రబాబు ప్రభుత్వంపై పోరాటం కొనసాగుతుందని ఉద్ఘాటించారు. జగన్ పార్టీ పెట్టిన దగ్గర నుండి అయన వెంటే నడుస్తున్నాం. గతంలో చంద్రబాబు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో ఎన్నో మీటింగ్‌లు పెట్టారు.. ర్యాలీలు నిర్వహించారు.

# అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలి

**- : ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ గా శివ్ నారాయణ్ శర్మ**






**అంకుశం న్యూస్ అనంతపురం, జులై 21 :** అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి ఇంచార్జి జిల్లా కలెక్టర్ గా శివ్ నారాయణ్ శర్మ అర్జీలను స్వీకరించారు. ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జిల్లా రెవెన్యూ అధికారి ఏ.మాలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, ఆనంద్, రామ్మోహన్, మల్లికార్జునుడు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, తదితరులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 612 అర్జీలను ఇంచార్జి జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు ఆర్జీలను సీరియస్ గా తీసుకొని పరిష్కరించాలని, అర్జీదారులతో మాట్లాడేటప్పుడు వారి ప్రవర్తన మార్చుకొని మాట్లాడాలన్నారు. పిజిఆర్ఎస్ పై సీఎంఓ స్థాయి నుంచి మానిటర్ చేయడం జరుగుతోందని, అర్జీలకు నాణ్యమైన ఎండార్స్మెంట్ అందించాలన్నారు. ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో, వేగవంతంగా, నిష్పక్షపాతంగా అర్జీలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారం కోసం తీసుకునే చర్యల్లో అలసత్వం ప్రదర్శించవద్దని, ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వాటి పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. మండల స్థాయిలో కూడా పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి దరఖాస్తుదారునికి నాణ్యమైన పరిష్కారం చూపించాలన్నారు. స్వీకరించిన ప్రతి ఫిర్యాదుకు రసీదు ఇవ్వడంతో పాటు సమస్య పరిష్కారానికి చివరి వరకు వేచి చూడకుండా, బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా గడువులోపే పెండింగ్ లేకుండా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా స్వీకరించిన ప్రతి ఫిర్యాదుకు ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. ఎక్కడ కూడా ఫిర్యాదుదారులకు ఎండార్స్మెంట్లు అందడం లేదనే ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆదేశించారు. ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలకు సంబంధించిన ఫిర్యాదులపై దృష్టిని సారించి సత్వరమే వాటి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. అలాగే సిఎమ్ఓ, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల ద్వారా సంబంధిత శాఖలకు వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ తో పాటు మండల స్థాయిలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, రెవెన్యూ సేవలు, రీ సర్వే పనులను ఆయా గ్రామాల్లో వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా పి- 4 మార్గదర్శకుల పెండింగ్ పనులను పూర్తిస్థాయిలో నివేదించాలన్నారు. డిఆర్ఓ మలోలా మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సంబంధిత శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు కూడా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు

- ఈ కార్యక్రమంలో జడ్పి సిఈఓ శివ శంకర్, సిపిఓ అశోక్ కుమార్, డిపిఓ నాగరాజు నాయుడు, డిఆర్డీఏ పిడి శైలజ, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, జిల్లా సైనిక్ సంక్షేమ శాఖ అధికారి పి.తిమ్మప్ప, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, హౌసింగ్ పిడి శైలజ, డిటిసి వీర్రాజు, డిఎండబ్ల్యుఓ రామసుబ్బారెడ్డి, సర్వే ఏడి రూప్ల నాయక్, డివిఈఓ వెంకటరమణ నాయక్, మైన్స్ డిడి ఆదినారాయణ, డ్వామా పిడి సలీమ్ భాష, ఏపీఎంఐపి పిడి రఘునాథరెడ్డి, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.ఆత్మారావు, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా.కిరణ్ కుమార్ రెడ్డి, డిఈఓ ప్రసాద్ బాబు, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, ఎపిఎస్పిడిసిఎల్ ఎస్ఈ శేషాద్రిశేఖర్, కలెక్టరేట్ సెక్షన్ ల సూపరింటెండెంట్లు యుగేశ్వరిదేవి, వసంతలత, రియాజుద్దీన్, పిజిఆర్ఎస్ తహసీల్దార్ వాణిశ్రీ, ఆయా శాఖల జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాప్తాడును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే పరిటాల సునీత
- రానున్న నాలుగేళ్లలో రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధి చూస్తారు
- మన్నీల గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం
- గత ఐదేళ్లకి -ఈ ఏడాదిలో వచ్చిన మార్పు ప్రజలు - గమనించాలన్న సునీత





**అంకుశం న్యూస్ అనంతపురం జులై 21:** జిల్లాలో ఏ నియోజకవర్గంలో లేని విధంగా మన రాప్తాడు నియోజకవర్గం ఒక రోల్ మోడల్ గా ఉండే విధంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామనిరాప్తాడు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు గ్రామానికి ఎమ్మెల్యే పరిటాల సునీత రాగా గ్రామస్థులు, టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రామంలో 20లక్షల ఎన్ఆర్ఈజీఎస్, మండల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్తూ ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. తల్లికి వందనం, గ్యాస్ సిలిండర్లు, పింఛన్లు వంటి పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. తమకు పథకాలన్నీ అందుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. కొన్ని చోట్ల ముగ్గురు పిల్లలు ఉన్నా తమకు పథకాలు అందాయన్నారు. అలాగే గ్రామంలో కొన్ని సమస్యలను కూడా ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మన్నీల గ్రామంలో సంక్షేమ పథకాలు ఎంత మందికి అందాయన్నది వివరించారు. 6.39లక్షలతో మూడు గోకులం షెడ్స్, 8మందికి 9లక్షల సబ్సిడీతో స్ప్రింకర్లు, డ్రిప్పు అందజేసినట్టు చెప్పారు. ఐకేపీ ద్వారా డ్వాక్రా మహిళా సంఘాలకు 39లక్షల మేర రుణాలు ఇచ్చినట్టు చెప్పారు. అనంతపురం రూరల్ మండలంలో రికార్డు స్థాయిలో 13కోట్లతో రోడ్లు నిర్మించినట్టు చెప్పారు. 17,504 మందికి సంవత్సరానికి 94.22 కోట్ల రూపాయల మేర పింఛన్లు అందించామన్నారు. 64 మందికి 64 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధికి అందించినట్టు చెప్పారు. 49.57 కోట్లతో 33,361 గృహాలకు కొళాయి కనెక్షన్లు అందజేసినట్టు చెప్పారు. 18,934 మందికి తల్లికి వందనం కింద 24.61 కోట్ల రూపాయలు అందజేసినట్టు వివరించారు. ఒక్క ఏడాదిలో ఇంత అభివృద్ధి సంక్షేమం చేసి చూపించామన్నారు. గత ఐదేళ్లకి ఇప్పటికీ తేడా గమనించాలని ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు. కేవలం అభివృద్ధి, సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకురావాలన్న లక్ష్యంతో పని చేస్తున్నట్టు చెప్పారు...

## అంగన్వాడీ లబ్ధిదారులు తమ సమస్యలు పరిష్కరించాలని సిడిపిఓ ఆఫీస్ ముట్టడి.





**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జులై 21:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీస్ ముందు అంగన్వాడీ లబ్ధిదారులు ఫేస్ యాప్ ను రద్దు చేయాలని ధర్నా చేయడం జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, అంగన్వాడి జిల్లా కార్యదర్శి ఎం దుర్గమ్మ, మాట్లాడుతూ ఫేస్ యాప్ పేరుతో లబ్ధిదారులను చాలా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. అంగన్వాడి నుంచి పొందుతున్న సరుకులు ఇవ్వాలంటే లబ్ధిదారుల కు ఫేస్ యాప్ ను ఉపయోగించి సరుకులు ఇవ్వాలి కాని ఫేస్ యాప్ పడకపోతే సరుకులు ఇవ్వకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనివలన అనేకమంది లబ్ధిదారులు తమ పనులను ఆపుకొని రోజులు తరబడి అంగన్వాడి సెంటర్ల చుట్టూ తిరిగే పరిస్థితి అని అన్నారు . లబ్ధిదారులు మాట్లాడుతూ మేము పేద కుటుంబములకు చెందిన వారము ఏ రోజు పనికి వెళ్లకపోతే ఆరోజు మా పొట్టలు నిండవు. బాలింతలు, గర్భవతులు రావాలన్నా చాలా కష్టదాయంగా ఉంటుంది. పదేపదే ఫోటోలని, %జుఖ్జ% చేయాలని పిలుస్తున్నారు. వెళ్ళిన తర్వాత సిగ్నల్, నెట్వర్క్ ప్రాబ్లం గా ఉంది కొద్దిసేపు ఆగండి లేదా మరలా రండి అని అంగన్వాడీ టీచర్ గారు అంటున్నారు. రాకపోతే మాకు రావాల్సిన సరుకులు ఇవ్వడం కుదరదని అంటున్నారు. కావున మాకు గతంలాగా సంతకాలు పెట్టించుకుని సరుకులు ఇవ్వాలని, ఫేస్ యాప్ ని రద్దు చేయాలని కోరుకుంటూ %జణూా% ఆఫీస్ లో అధికారి కి రామచంద్రపురం ప్రాజెక్టు పరిధిలో ప్రతి సెంటర్ నుంచి లబ్ధిదారులైన మేము వచ్చి వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు వెంకటరత్నం, విజయలక్ష్మి, సూర్య కుమారి జహారా, దుర్గ, చంద్రకళ, లక్ష్మీరత్నం , దాసరి మౌనిక, భారీ గా లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సిపిఐ జిల్లా మహాసభల బహిరంగ సభ ఈనెల 31న జయప్రదం చేయండి

- సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ పిలుపు.
- చేనేత చేతి వృత్తిదారుల రాష్ట్ర అధ్యక్షులు జింకా చలపతి.



**అంకుశం న్యూస్ ధర్మవరం జులై 21:** ధర్మవరం నియోజకవర్గ సిపిఐ జిల్లా మహాసభలు ఈనెల 31 వ తేదీన నిర్వహించబడే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్జీవో హోం లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ తో పాటు చేనేత చేతి వృత్తి దారుల రాష్ట్ర అధ్యక్షులు జింకా చలపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం సమావేశంలో పలు విషయాలను చర్చించిన అనంతరం,ధర్మవరంలో రెండవసారి ధర్మవరం నియోజకవర్గ సిపిఐ కార్యదర్శిగా ముసుగు మధుని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కుల్లాయప్ప, సిపిఐ పట్టణ కార్యదర్శి రవి, పట్టణ సహాయ కార్యదర్శి రమణ, శ్రీనివాసులు, బత్తలపల్లి మండల కార్యదర్శి వెంకటేష్, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి వెంకటనారాయణ చెన్నంపల్లి శ్రీనివాసులు, యువజన సంఘం జిల్లా అధ్యక్షులు సకల రాజ, ముదిగుబ్బ మండల కార్యదర్శి శ్రీనివాసులు, తాడిమర్రి మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ, రామకృష్ణ, దాసు, సన్న పెద్దన్న, దళిత హక్కు పోరాట సమితి రామకృష్ణ, మహిళా సమైక్య లలితమ్మ, లింగమ్మ, రమీజా, తదితరులు పాల్గొన్నారు.

## అన్నా క్యాంటీన్ నిర్మాణ పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదు ఎమ్మెల్యే నల్లమిల్లి.





**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జులై 21:** అనపర్తిలో నిర్మాణం అవుతున్న అన్నా క్యాంటీన్ పనులను పరిశీలించిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి . ఈ సందర్భంగా నిర్మాణంలో లోపాలను గుర్తించిన ఎమ్మెల్యే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణ పనుల్లో ఎక్కడ అధికారులు పర్యవేక్షణ ఉన్నట్లు కనిపించడం లేదని, నాణ్యత విషయంలో కూడా కాంట్రాక్టర్ పర్యవేక్షించడం లేదని అన్నారు. నిర్మాణ పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. అధికారులు వెంటనే నిర్మాణ స్థలానికి వచ్చి లోపాలను సరిచేయాలని మంగళవారం తాను తిరిగి నిర్మాణం దగ్గరికి వస్తానని లోపాలను అధికారులకు చూపుతానని అన్నారు. కనీసం సిమెంట్ పనులకు వాటరింగ్ కూడా చేయకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట అనపర్తి మండలం కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు ఉన్నారు.

## మున్సిపల్ శాఖలో ఔట్‌సోర్సింగ్ వర్కర్ల వేతనం పెంపు

**- ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ ప్రభుత్వం**



**(అంకుశం, అమరావతి, జూలై 21):** ఏపీ మున్సిపల్ శాఖలో ఔట్‌సోర్సింగ్ నాన్ పీహెచ్ వర్కర్ల వేతనాలు పెరిగాయి. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.కేటగిరీ-1 వర్కర్ల వేతనం రూ.21,500 నుంచి 24,500కు, కేటగిరీ-2 వర్కర్ల వేతనం రూ.18,500 నుంచి రూ.21,500, కేటగిరీ-3 వర్కర్ల వేతనం రూ.15వేల నుంచి రూ.18,500కు పెంచింది.

## అధికారులు అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదు.

- ప్రజలు గుమికూడే ప్రాంతాల్లో ప్రజలకు అవసరమయ్యే మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.
- జిల్లా కలెక్టర్ టి ఎస్ చేతన్



**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి ,జులై,21 :** తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో వచ్చే అర్జీదారుల సమస్యలను.. అర్జీదారుడు సంతృప్తిచెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ టి ఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశపుహాల్లో.. ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ టి ఎస్ చేతన్ తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ డిఆర్వో పార్థసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ,రామ సుబ్బయ్య, ఆర్డీవో సువర్ణలు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ టి ఎస్ చేతన్ మాట్లాడుతూ....ప్రజలు గుమికూడే ప్రాంతాల్లో ప్రజలకు అవసరమయ్యే తాగునీరు, టాయిలెట్స్ తదితర సౌకర్యాలను వెంటనే ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎటువంటి సౌకర్యాలను కల్పించారో వాటి వివరాలు ప్రజలకు తెలిసేవిధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు భూ సమస్యల పరిష్కారం, రేషన్ కార్డులు, ఇంటి పట్టాల మంజూరు, పెన్షన్ ల మంజూరు తదితర అంశాలతో కూడిన వినతులను సమర్పించారు.

# పీవీ మిథున్ రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం

## పెద్దిరెడ్డి కుటుంబం పై కక్ష సాధింపుతోనే చర్యలు

## ఆలూరు సాంబశివారెడ్డి

**అంకుశం న్యూస్ అనంతపురం జూలై 21 :**చిత్తూరు జిల్లాలో గత 40 సంవత్సరాల కు పైగా పెద్దిరెడ్డి కుటుంబం చంద్రబాబు కుటుంబం మధ్య రాజకీయ వైరం ఉందని ఆది దృష్టిలో పెట్టుకొని పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశంతోనే ఎంపీ మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని లేని కేసుని సృష్టించారని వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మూడు సార్లు లోక్‌సభకు ఎన్నికైన పీవీ మిథున్ రెడ్డి , ఎటువంటి తప్పూ చేయకుండా, ప్రజల సంక్షేమం కోసం పనిచేసినందుకు శిక్ష అనుభవిస్తున్నారు. ఇది ఒక రాజకీయ కుట్ర మాత్రమే. లిక్కర్ పాలసీ రూపకల్పనలో లేదా అమలులో ఆయనకు ఎలాంటి పాత్ర లేకపోయినా, ఆయనపై తప్పుడు ఆరోపణలు మోపుతూ, బలవంతపు ఒప్పందాలు తీసుకొని, రాజకీయ ప్రేరణతో విచారణ చేపట్టి అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్య అని ఆలూరి సాంబశివారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు రాజకీయాల్లో అధికారం ఎవరికి శాశ్వతంగా ఉండదని అది మరిచి కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని రాజకీయాల్లో కొత్త సాంప్రదాయానికి చంద్రబాబు నాయుడు తెరలేపారని ఇది ప్రమాదకరమని ఆలూరి సాంబశివారెడ్డి అన్నారు. మా ప్రభుత్వం (2019 - 2024) కాలంలో 43,000 బెల్ట్ షాపులను మూసివేశాం లిక్కర్ షాపులను 4,380 నుండి 2,934కి తగ్గించాంపారదర్శకంగా ఆదాయాన్ని పెంచాంమద్యం మాఫియాను అదుపు చేసి నియంత్రణను తీసుకువచ్చాం అని ఆలూరి సాంబశివారెడ్డి అన్నారు. కంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (CCI) మా లిక్కర్ పాలసీపై వేసిన ఫిర్యాదులపై విచారించి, 2022 సెప్టెంబర్ 19న ఇచ్చిన ఉత్తర్వులో ఇలా తేల్చింది: లి మా పాలసీ పోటీకి వ్యతిరేకంగా లేదనిఎలాంటి భేదభావం లేదా అన్యాయం జరగలేదని

మద్యం రంగంలో మోనాపోలీలను తగ్గించి సమవాయాన్ని పెంచిందని దేశంలోని అగ్రస్థాయి పోటీ నియంత్రణ సంస్థ కూడా మా పాలసీ సమర్థవంతమైనది, పారదర్శకమైనది, ప్రజా ప్రయోజనానికి అనుగుణమైనదే అని ధృవీకరించింది. అని ఆలూరి సాంబశివారెడ్డి గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పటి ప్రభుత్వం మా విజయాల్ని తుడిచివేసి, తాము చేస్తున్న వైఫల్యాలనుకప్పిపుచ్చుకోవడానికి, ప్రజల పక్షాన నిలిచిన నాయకులను అరెస్ట్ చేస్తోంది. అని వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు ప్రజలు కూటమి ప్రభుత్వంపై తిరగబడ్డానికి రోజులు దగ్గరపడ్డాయని ఇటువంటి అక్రమ అరెస్టులతో వైసిపి శ్రేణులను భయపెట్టలేరని తిరుగుబాటు తప్పదని ఆలూరు సాంబశివరెడ్డి హెచ్చరించారు



# ఎపిలో పి.ఎమ్.ఎస్.హెచ్.ఆర్.ఐ పథకం కింద మరిన్ని పాఠశాలలను చేర్చే అవకాశం

## కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి జయంత్ చౌధరి వెల్లడి

### ఆంధ్రప్రదేశ్ లో పి.ఎమ్.ఎస్.హెచ్.ఆర్.ఐ స్కూల్ వివరాలపై ప్రశ్నించిన ఎంపీ కేశినేని శివనాథ్

### ఈ పథకం కింద ఎన్టీఆర్ జిల్లాలో ఎంపికైన 29 పాఠశాలలకు రూ.1620.6 లక్షలు వినియోగం

**అంకుశం ప్రతినిధి విజయవాడ జులై 21:** భారత ప్రభుత్వం ప్రారంభించిన ప్రధాన్ మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (PMSHRI) పథకం, దేశంలోని పాఠశాల విద్యా రంగాన్ని సమూలంగా మార్చే దిశగా కీలకంగా మారుతోంది. జాతీయ విద్యా విధానం - 2020 లోని ప్రతి అంశాన్ని ప్రదర్శించే విధంగా ఈ పాఠశాలలు రూపొందించబడతాయి. ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్ లో ఎంపికైన పాఠశాలల అభివృద్ధి పూర్తైన తర్వాత మరిన్ని పాఠశాలలను ఈ పథకం కింద చేర్చాలనే ఆలోచనలో వున్నట్లు కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి జయంత్ చౌధరి వెల్లడించారు. విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖనుఎపీలోపి .ఎమ్.ఎస్.హెచ్.ఆర్.ఐ పథకం కింద జిల్లాల వారీగా అభివృద్ధి కోసం ఎంపిక చేసిన పాఠశాలల సంఖ్య, నిర్మించాల్సిన సదుపాయాలు, నిధుల కేటాయింపు, ఈ పథకంలో కొత్త పాఠశాలలను చేర్చుకునే అవకాశం వుందా తెలియపర్చాలంటూ లోక్ సభలో అడిగిన ప్రశ్నకు సోమవారం కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి జయంత్ చౌధరి లిఖిత పూర్వకంగా సమాధానం తెలిపారు. రాష్ట్రంలో ప్రధాన్ మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకం కింద అత్యధికంగా కర్నూలు జిల్లాలో 54 పాఠశాలలు, విశాఖపట్నంలో కేవలం 6 పాఠశాలలు మాత్రమే ఎంపికైనట్లు తెలిపారు. ఇక ఎన్టీఆర్ జిల్లాలో ఈ పథకం కింద 29 కింద పాఠశాలలు ఎంపిక కాగా,ఈ పాఠశాలల కోసం రూ.3,404.1 లక్షలు నిధుల కేటాయించి, రూ.1628.2 లక్షలు నిధులు విడుదల చేసి, రూ.1620.6 లక్షలు వినియోగించినట్లు తెలిపారు. ఈ పాఠశాలల అభివృద్ధిలో ప్రధానంగా సైన్స్ ల్యాబ్స్, స్మార్ట్ తరగతులు, డిజిటల్ బోర్డులు, LED లైటింగ్, గ్రంథాలయాలు, ఆటల మైదానాలు, మరియు 'గ్రీన్ స్కూల్స్' లక్ష్యంగా ఉన్నాయని మంత్రిత్వ శాఖ తెలిపింది.

జాతీయ విద్యా విధానం - 2020లో పేర్కొన్న అన్ని అంశాలను ఆచరణలో పెట్టే విధంగా ఈ పాఠశాలలుతీర్చిదిద్దబడుతున్నాయి. పారదర్శక పోటీ పద్ధతిలో ఎంపిక చేసిన ఈ పాఠశాలల్లో విద్యార్థులకు సమాన అవకాశాలు, ఆధునిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి జయంత్ చౌధరీ వెల్లడించారు.ఈ పాఠశాలలు విద్యార్థుల్లో కేవలం పాఠాలు బోధించడం మాత్రమే కాకుండా, సమగ్ర వ్యక్తిత్వ అభివృద్ధితో పాటు నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తాయన్నారు. ఈ పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్‌రూములు, సైన్స్ ల్యాబ్స్, డిజిటల్ లైబ్రరీలు, ఎల్.ఈ.డి లైటింగ్,



ఔషధ తోటలు, గ్రీన్ కంపోస్టింగ్ యూనిట్లు ఏర్పాటు చేయబడి విద్యార్థులకు ఆధునిక విద్యను అందించేందుకు చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు..పారదర్శక పోటీ పద్ధతిలో ఈ పాఠశాలల ఎంపిక జరిగినట్లు తెలిపారు. ఈ పాఠశాలలకు అవసరమైన సదుపాయాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సమర్పిస్తుందని, ఆ ప్రతిపాదనలను ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు (PAB) ఆమోదిస్తుందన్నారు..

# కేసులకు భయపడే ప్రసక్తే లేదు

## భవిష్యత్తులో కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదు...

## మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

**అంకుశం న్యూస్ నంద్యాల జూలై 21:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ని లిక్కర్ స్కామ్ కేసులో ఇరికించి అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, తాము కేసులకు భయపడే ప్రసక్తే లేదని భవిష్యత్తులో మూల్యం చెల్లించక తప్పదని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి కూటమి ప్రభుత్వ నేతలపై మండిపడ్డారు. సోమవారం స్థానిక వైఎస్ఆర్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మీడియా సమావేశం ఏర్పాటు చేసి కూటమి ప్రభుత్వం నేతలు వైయస్ఆర్సీపీ నాయకుల పై కార్యకర్తలపై అలాగే సోషల్ మీడియా యాక్టివిష్టులపై తప్పుడు కేసులు బనాయిస్తూ జైళ్ళ లోకి నెడుతున్నారని, ఇటువంటి కక్షపూరిత విధానాలపై తీవ్రంగా మండిపడ్డారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటిపోతున్న కూడా రాష్ట్రంలో ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన లేదని, అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కకు నెట్టి కేవలం వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులపై, అలాగే ప్రభుత్వంలో పని చేసిన ఉన్నత స్థాయి అధికారులైన ఐఏఎస్ లు , ఐపీఎస్ ల పై క్షపూరితంగా వ్యవహరిస్తూ వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ కేసులు పెట్టి జైళ్ళ లోకి నెడుతున్నారని అన్నారు. లిక్కర్ కేసులో ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్టు చేసి చార్జి షీట్ లో పేరు చేర్చడం కూటమి ప్రభుత్వ దుర్మార్గ చర్యలకు పరాకాష్ట అన్నారు. లిక్కర్ స్కామ్ లో నాడు యాభై వేల కోట్లు దోచుకున్నారని, 40 వేల కోట్లు దోచుకున్నారని, మరోసారి 30 వేల కోట్లు దోచుకున్నారని, మూడు వేల కోట్లు దోచుకున్నారని, నేడు 2వేల కోట్లు దోచుకున్నారని కూటమి నేతలు అసత్యపు ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు.




డైవర్ట్ పాలిటిక్స్ కు కేరాఫ్ అడ్రస్ గా కూటమి ప్రభుత్వ నేతలు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. తిరుపతి లడ్డు విషయంలో చేసిన రాద్ధాంతం ప్రజలు మరచిపోరని అన్నారు. ఎల్లో మీడియాని అడ్డుపెట్టుకొని అనేక కథనాలను వండి వారుస్తూ ప్రజల దృష్టిని మరలుస్తున్నారని పేర్కొన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతున్నదని, అడుగడుగునా బెల్టు షాపులు నిర్వహిస్తూ త్రాగండి తూగండి అనే రీతిలో నేడు రాష్ట్రంలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు విషయం రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం లేదని కేంద్ర ప్రభుత్వం చట్ట పరిధిలో తన పని తాను చేసుకొని వెళ్లిందని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను పంచుకున్న సోషల్ మీడియా యాక్టివిష్టులను అరెస్టులు చేసి రిమాండ్లు, తప్పుడు కేసులను బనాయిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలం దాటిపోయిందని, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేశారా లేదో ప్రజలకు తెలియజేయాలన్నారు. తల్లికి వందనం పథకాన్ని ఎంతవరకు అమలు చేశారు? ఎంతమంది తల్లులకు వారి ఖాతాల్లో నగదును బదిలీ చేశారో చెప్పాలన్నారు.

## సత్య సాయి జిల్లా సెక్రటరీ గా డోలా రాజారెడ్డి నియామకం

**అంకుశం న్యూస్ ధర్మవరం జులై 21:** భారతీయ జనతా పార్టీ సత్యసాయి జిల్లా సెక్రెటరీగా ధర్మవరం పట్టణానికి చెందిన డోలా రాజారెడ్డి ని నియమించారు. తనకు ఈ అవకాశం కల్పించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీన్ మాధవ్ గారికి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ గారికి,బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ గారికి, మాజీ జిల్లా అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసులు గారికి, బిజెపి సీనియర్ నాయకులు ముఖ్యంగా సత్యసాయి సాయి జిల్లాలో ఉన్నటువంటి నా భారతీయ జనతా కుటుంబ సభ్యులందరికీ కూడా పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను...అని డోలా రాజారెడ్డి పత్రికల వారికి తెలియజేసారు.



## ఆంధ్రా పేపర్ మిల్లు కార్మికులకు సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే సత్తి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూలై 21:** గత వారం రోజులుగా రాజమండ్రి ఆంధ్రా పేపర్ మిల్లు కార్మికుల న్యాయమైన డిమాండ్లపై పోరాటం చేస్తున్న రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజాని కలిసి సంఘీభావం తెలిపిన అనపర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), అనపర్తి వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈ రహదారి బాగుచేయండి



**అంకుశం న్యూస్ ధర్మవరం జులై 21:** ధర్మవరం పట్టణంలోని ప్రధాన రహదారిగా ఉపయోగిస్తున్న కదిరి గేటు రోడ్డుపై రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. గత కొన్ని నెలలుగా ఈ మార్గంలో అనేక ప్రమాదాలు సంభవించాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్డులో ఉన్న గుంతలు, ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు లోనవుతున్నారు. అధికారులు మాత్రం చిన్నచిన్న తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేస్తున్నారు. ఇవి కొన్ని రోజులు కూడా నిలవకపోవడంతో ప్రజలు "తాత్కాలిక పనులు వృథా" అని మండిపడుతున్నారు.ఈ రహదారి మరమ్మత్తులు చేపట్టాలి.

## అన్ని గ్రామాల్లో రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

### రూ.2.80 కోట్లతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి సుభాష్

**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూలై 21:** దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాల్లో రోడ్లు,మౌలిక సదుపాయాలు కల్పించి మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా రామచంద్రపురం నియోజవర్గం కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామంలో రూ.2.80 కోట్ల నాబార్డ్ నిధులతో నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణానికి సోమవారం మంత్రి సుభాష్ శంకుస్థాపన చేశారు. కాకినాడ కోటిపల్లి రోడ్డు నుంచి శలపాక వెళ్లే రోడ్డుకు ఈ నిధులు వెచ్చించి భూమి పూజ చేయడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గ్రామీణ రహదారులతో పాటు, గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయంగా పేర్కొన్నారు. కూటమి ఏడాది పాలనలో సుమారు రూ. 1200 కోట్లు వెచ్చించి గుంతలు లేని రోడ్లు నిర్మించామన్నారు. అలాగే మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ నిధుల ద్వారా రామచంద్రపురం నియోజవర్గంలో కోట్లాది రూపాయలతో రోడ్లు నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్లన్నీ దీనావస్థకు చేరుకున్నాయని, అభివృద్ధి, సంక్షేమం ఊసే లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను అధిగమించి అభివృద్ధికి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. రామచంద్రపురం నియోజవర్గ చరిత్రలో ముందెన్నడూ లేని విధంగా ఏడాది కాలంలోనే రూ.125 కోట్లు నిధులు తీసుకొచ్చి పలు అభివృద్ధి పనులు చేశామని వివరించారు. భవిష్యత్తులో మరిన్ని నిధులు తీసుకొచ్చి ప్రణాళిక బద్ధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇ ఏ ఎస్ ఎన్ బాబు, మండల ప్రజా పరిషత్ అధికారి జె రాంబాబు, ఏయ్ వెంకటేశ్వరరావు, ఇతర శాఖల అధికారులు, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పీ ఉద్యోగి శివ నారాయణరెడ్డి మృతి

### సంతాపం తెలిపిన జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ

**అంకుశం న్యూస్ అనంతపురం:జూలై 21:** అనంతపురంలోని హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న జెడ్పీ ఉద్యోగి శివ నారాయణ రెడ్డి సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస వదిలారు. మొన్నటి వరకు జిల్లా పరిషత్ లో టైపిస్ట్ గా పనిచేసిన శివ నారాయణ రెడ్డి ఇటీవల జరిగిన బదిలీల్లో పెనుకొండలోని ఆర్.డబ్ల్యూ.ఎస్ డివిజన్ కార్యాలయంలో టైపిస్ట్ గా మారారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన..ఆదివారం రాత్రి భోజనం చేశాక నిద్రపోయారని జెడ్పీ ఉద్యోగులు తెలిపారు. తెల్లారినా లేవకపోవడంతో పాటు కదలికలు లేకపోవడంతో కుటుంబ సభ్యులు నిద్రలేపేందుకు ప్రయత్నించారన్నారు. అయితే ప్రయోజనం లేకపోవడంతో చనిపోయినట్లు నిర్ధారించుకున్నారని తెలిపారు. సౌమ్యుడిగా ఉంటూ..అందరితో మంచిగా ఉండే శివ నారాయణ రెడ్డి ఇక లేరని తెలిసి జెడ్పీ ఉద్యోగులు ఆవేదనకు లోనయ్యారు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.



**జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ దిగ్భ్రాంతి**

టైపిస్ట్ శివ నారాయణ రెడ్డి మరణించినట్లు తెలియగానే జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. క్రమ శిక్షణ కలిగిన మంచి ఉద్యోగిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేసారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలిపారు. జెడ్పీ సీఈఓ శివ శంకర్, డిప్యూటీ సీఈఓ లక్కిరెడ్డిపల్లి వెంకటసుబ్బయ్య కూడా శివ శంకర్ రెడ్డి మృతికి సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. విషయం తెలిసిన వెంటనే జెడ్పీ ఉద్యోగులందరూ హౌసింగ్ బోర్డులోని మృతిని ఇంటికి వెళ్లి శివనారాయణ రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళ్లులర్పించారు.